క్లుప్తంగా

పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఐదో పట్టణ పోలీస్ సిబ్బంది

మద్రిపాలెం: పోలీస్ కమిషనర్ రవిశంకర్ పోలీసుల ఆరోగ్యానికి భద్రత కల్పించేలా నగరంలోని అన్ని పోలీస్ స్టేషనల్లో సిబ్బందికి సుమారు 60 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం 150 మందికి పైగా పోలీసులకు ప్రైవేట్ ల్యాబ్‌ల సహకారంతో వారి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. వైద్య సిబ్బంది వారికి ఆరోగ్య విషయమైన సలహాలు, సూచనలిచ్చారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై పార్కింగ్‌తో ఇబ్బందులు



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో రోడ్డుపై పార్క్‌చేసిన వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని రహదారిపై వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇక్కడున్న దుకాణాలకు వచ్చిన వారు తమ ద్విచక్ర వాహనాలను రోడ్డుపైనే పార్క్‌చేయడంతో ట్రాఫిక్ జామై ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అక్కడ కార్లు యూ టర్న్ తీసుకోవడం కష్టతరంగా మారింది. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు వీసీ అభినందన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డిగ్రీ ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో శనివారం ఉదయం అభినందించారు. సత్య డిగ్రీ కళాశాలకు చెందిన కొమ్మురు రమ్య యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. విజయనగరం జిల్లా పరిధిలో కళాశాల విద్యార్థులు కె.రమ్య, టి.ఊర్మిళ టాపర్‌లుగా నిలిచారు. వారిని వీసీ అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సత్య గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.సాయి దేవమణి, విభాగాధిపతి డాక్టర్ ఎస్.వరూధిని పాల్గొన్నారు.

నమో ఆంజనేయం

- అంగరంగ వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు
- భక్తులతో కళకళలాడిన ఆలయాలు



లలితా పీఠంలో మన్యు పాశుపత హోమం చేస్తున్న వేద పండితులు, భక్తులు

సీతంపేట: రామదూత హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం నియోజకవర్గంలోని రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. భక్తులు వేకువజాము నుంచి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. సీతంపేట పార్వతీశ్వరాలయ ఆవరణలోని అభయాంజనేయ స్వామికి ఈవో జి.వి.రమాభాయి పర్యవేక్షణలో అర్చకులు పంచామృత, గంధ, విభూది, పండ్ల రసాలతో అభిషేకం, తమలపాకులతో అష్టోత్తరం, సింధూరంతో అర్చన జరిపారు.

- మధురానగర్ శ్రీ సద్గురు బ్రహ్మ రామదూత ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, తమలపాకులు, సింధూరంతో పూజలు నిర్వహించారు.
- లలితానగర్ లలితా పీఠంలో ఆంజనేయస్వామి విగ్రహానికి పంచామృతాభిషేకం, అనంతరం మన్యు పాశుపత హోమం నిర్వహించారు. సాయంత్రం పీఠం దర్బారు హాల్లో సామూహిక హనుమాన్ చాలీసా, విష్ణు సహస్ర నామా పారాయణ, సుందరాకాండ పారాయణ కడురమ్యంగా జరిగింది. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.
- జగన్నాథపురంలోని మూడు గుళ్ల వద్ద కొలువైన అభయాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.
- వైఎస్సార్‌సీపీ నాయకుడు కొణతాల రేవతీరావు ఆధ్వర్యంలో 26వ వార్డు అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని ఇండియన్ జిమ్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

అభయాంజనేయుడికి అభిషేకాలు

సీతమ్మధార: సీతమ్మధార కొండవాలు ప్రాంతంలోని 108 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో ధర్మకర్త ఎ.ఎస్.ఎన్.రాజు ఆధ్వర్యంలో



పట్టాభిరెడ్డి గార్డెన్స్‌లో ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న కె.కె.రాజు, అల్లు శంకరరావు

విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ, అస్త్రరాజార్చన, మహన్యాస పూర్వక మన్యు సూక్త పంచామృతాభిషేకం, దశ సహస్ర సింధూర్చన, దశ సహస్ర నాగవల్లి దళ పూజలు, నీరాజన మంత్ర పుష్ప పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

- సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వెంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి అభిషేకాలు, సింధూర, ఆకు పూజలు, మన్యు సూక్త హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాధవధారలో అన్నసమారాధన

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధార అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త, వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి వేకువజాము నుంచి ఆకుపూజ, ప్రత్యేక అభిషేకాలు, హోమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, పేడాడ రమణికుమారి, పైడి శ్రీను, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

హనుమాన్ ఆలయాల సందర్శన

వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావుతో కలిసి వార్డులోని పలు దేవాలయాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఎన్‌జీజీవోస్ కాలనీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం, పట్టాభిరెడ్డి గార్డె



అక్కయ్యపాలెంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు తదితరులు

న్స్‌లో శ్రీ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సుందర అభయాంజనేయుడికి కె.కె.రాజు పూజలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల సుందర అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఆలయ గౌరవ అధ్యక్షుడు ఆళ్ల నరసింగరావు, పార్టీ నాయకులు హరిపట్నాయక్, దుర్గ, గణపతి, సన్ని, నాయుడు పాల్గొన్నారు.

తన్మయ మారుతి అలంకరణలో యోగసిద్ధాంజనేయుడు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్-2లోని యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో





ప్రత్యేక అలంకరణలో దాసాంజనేయస్వామి, పూజల్లో పాల్గొన్న భక్తులు



కె.కె.రాజును సత్కరిస్తున్న సుందర అభయాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు

పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించారు. తన్మయ మారుతిగా స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. లోక కల్యాణార్థం సీతారామాచార్యులు మంగళ శాసనంతో ఆలయ అర్చకులు, భక్తుల సమక్షంలో సీతారామ కల్యాణోత్సం వేడుకగా జరిగింది. వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు శేషాచార్యులు సీతారామ కల్యాణాన్ని వివరిస్తూ వ్యాఖ్యానం చేశారు. ఉభయ దేవేరులు తరవున ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు, యశోద దంపతులు ఆలయ కమిటీ సభ్యులు, ఫల, పుష్పాలు సమర్పించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో 12,000 మంది భక్తులకు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీరామ నామ సంకీర్తన, సహస్ర నామార్చన, సింధూర అర్చన, తమలపాకులతో పూజ ఘనంగా నిర్వహించి భజనా నందహారతిని స్వామివారికి సమర్పించారు.



మాధవధార ఆలయం వద్ద అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు, చంద్రమౌళి తదితరులు

దాసాంజనేయుడికి విశేష అర్చనలు

పట్టాభిరెడ్డితోటలోని గణపతి సంయుక్త దాసాంజనేయ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు ఆరవిల్లి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు పంచామృతాభిషేకం ప్రసాదంగా పంపిణీ చేశారు. అత్యధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఒమ్మి నారాయణరావు, గౌరవాధ్యక్షుడు ఎం.ఎ.ఆర్.రాజు, కార్యదర్శి ఆర్.పి.నాయుడు, ఉపాధ్యక్షుడు ఎస్.వి.రమణ, కోశాధికారి వి.రమణ ఉత్సవాల నిర్వహణకు సహకరించారు.



తన్మయ మారుతిగా యోగసిద్ధాంజనేయుడు



నార్త్ ఎక్స్‌టెన్షన్ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి



సీతమ్మధార కొండవాలులో పూజలందుకున్న అభయాంజనేయుడు

గాలివానకు కూలిన చెట్లు



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో కూలిన వృక్షం

సీతంపేట: నగరంలో శుక్రవారం అర్ధరాత్రి గాలివాన బీభత్సానికి 26వ వార్డులో పలు చోట్ల చెట్లు కొమ్మలు విరిగి పడగా.. కొన్ని ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని 49-38-2 ఇంటి వద్ద చెట్టు నేలకొరిగింది. చెట్టు ఎండిపోయి ఉండటంతో గాలివానకు కూలింది. అర్ధరాత్రి ఈ ఘటన సంభవించడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. చెట్టును తొలగించడానికి ఎవరూ రాలేదని స్థానికులు అంటున్నారు.




అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో కూలిన చెట్టు

అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని వేణుగోపాల స్వామి ఆలయం ఎదురుగా చెట్టు కూలిపోయింది. రోడ్డుకు అడ్డంగా చెట్టు పడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

పర్యావరణ పరిరక్షణకు అందరి సహకారం

మురళీనగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి కోరారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో శనివారం నిర్వహించిన క్లబ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్కుల్లో పచ్చదనం పెంపు ద్వారా ప్రజల ఆరోగ్యానికి మేలు చేయగలమని, ఆ దిశగా వాకర్స్ క్లబ్ కృషి చేస్తోందన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటేందుకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకోవాలన్నారు. విశాఖను గ్రీన్ క్లైమేట్ నగరంగా తీర్చిదిద్దేందుకు వాకర్స్ తమ వంతు బాధ్యత నిర్వహించాలని కోరారు. వాకర్స్ జిల్లా 101 గవర్నర్ టి.రంగారావు మాట్లాడుతూ మురళీనగర్ వాకర్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా ఉన్నాయన్నారు. గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు



మాట్లాడుతున్న పల్లా చంద్రమౌళి

నాటాలని పిలుపునిచ్చారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం నూతన సభ్యులతో ప్రమాణం చేయించి వాకర్స్ ఇంటర్నేషనల్ లక్ష్యాలు, నియమావళిని తెలియజేశారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, కె.ద్వారకానాథ్, కార్యదర్శి పి.చెల్వారాజు, కోశాధికారి జె.కూర్మారావు, పెంటకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన ఆన్‌లైన్ శిక్షణ తరగతులు

మద్దిలపాలెం: ఏపీ పీజీ సీఈటీ ప్రవేశ పరీక్ష కోసం నెల రోజులుగా డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ఆన్‌లైన్ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులకు రాష్ట్రం నలుమూలల నుంచి శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకూ అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారని చెప్పారు.

చెరువులో వాటర్ ట్యాంకర్ బోల్తా

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ రాజు గారి చెరువులో శనివారం ఓ వాటర్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ప్రాంతంలో ఓ చోట నుంచి అనధికారికంగా భారీ ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని తరలిస్తుంటారు. ఈ క్రమంలో వాటర్ ట్యాంకర్ లోడ్‌తో వస్తుండగా ఇక్కడ చెరువు వద్ద ఒక్కసారిగా బోల్తాపడింది. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ చాకచ



చెరువులో పడిన వాటర్ ట్యాంకర్

క్యంగా బయటపడ్డాడు. గతంలో ఈ చెరువు వద్ద నీటిని తోడుతుండగా అధికారులు హెచ్చరించారు. అయినప్పటికీ కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం ఇక్కడి నీటిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి వ్యాపారాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కౌంటింగ్ వేళ అప్రమత్తం

- అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు
- 300 మంది ఫోర్స్‌తో పర్యవేక్షణ
- పక్కాగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు
- ద్వారకా జోన్ సీఐ ఎస్.రమేష్

సీతమ్మధార: ఈ నెల 4న ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.రమేష్ తెలిపారు. ఎక్కడైనా, ఎవరైనా అల్లర్లు, అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శనివారం 'సాక్షి'తో ఆయన మాట్లాడారు.

ఊరేగింపులు, సంబరాలు చేయొద్దు

నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు



ఈ నెల 4వ తేదీ కౌంటింగ్ రోజున రాజకీయ పార్టీలు ఊరేగింపులు, సంబరాలు జరిపితే చర్యలు తప్పవని సీఐ స్పష్టం చేశారు. నగరంలో 144 సెక్షన్‌తోపాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. 300 మంది లా అండ్ ఆర్డర్ పోలీసులు, సెంట్రల్ ఫోర్స్, రిజర్వ్ పోలీసులు, ఇతర పోలీస్ ఫోర్స్ పర్యవేక్షిస్తుంటారని చెప్పారు.

గుంపులుగా ఉండొద్దు

కౌంటింగ్ రోజున ఎక్కడా గుంపులు గుంపులుగా ఉండరాదని, ఇద్దరు కంటే మించి ఉండొద్దని సీఐ రమేష్ తెలిపారు. రౌడీషీటర్లు, పలు కేసుల్లో ఉన్న నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఇప్పటికే రౌడీషీటర్లకు ముందస్తు హెచ్చరికలు చేశామని చెప్పారు. ఎక్కడైన పెట్రోల్, మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా

ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సెంట్రల్ ఫోర్స్ పర్యవేక్షణ ఉంటుందని సీఐ చెప్పారు. సీతంపేట రెల్లివీధి, రాజేంద్రనగర్, అశోక్‌నగర్, సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో అల్లర్లు, రెచ్చగొట్టే వ్యవహారాలు చేసే వారిపై పోలీస్ ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

ప్రజలు, యువతకు విజ్ఞప్తి

ఓట్ల లెక్కింపు రోజున యువకులు, విద్యార్థులను అల్లర్లు జరిగే ప్రాంతాలకు పంపించరాదని వారి తల్లిదండ్రులకు సీఐ రమేష్ విజ్ఞప్తి చేశారు. అనవసర కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. రాజకీయ పార్టీల అభ్యర్థుల కార్యాలయం వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుందని, గొడవలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ఫలితాలు విడుదల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శేష జీవితం హాయిగా సాగాలి



తణుకు ప్రసాదరావును సత్కరిస్తున్న కుటుంబ సభ్యులు

దాబాగార్డెన్స్: పదవి విరమణ చేసిన రైల్వే ఉద్యోగి తణుకు ప్రసాదరావు శేష జీవితం హాయిగా సాగిపోవాలని తూర్పు తీర రైల్వే జోన్ అధికారులు ఆకాంక్షించారు. ఈ మేరకు శనివారం నగరంలోని ఓ కార్యాలయంలో ప్రసాదరావు వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అంకిత భావంతో చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసరావు, ఝాన్సీ రాణి, రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, మంజుల, వీఎస్‌జే రాజు, సుధారాణి, వీవీ ప్రకాష్, వీజేడీ రాజు, ఆశీర్వాదం, శ్యామ్ పాల్గొన్నారు.

రైల్వే హాస్పిటల్‌లో మలేరియా అవగాహన శిబిరం



మలేరియా నివారణ పద్ధతులను వివరిస్తున్న తులసి, చిత్రంలో చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ జ్యోతి

తాటిచెట్లపాలెం: మలేరియా నివారణ మాసం సందర్భంగా డివిజనల్ రైల్వే హాస్పిటల్‌లో చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఆర్.టి.జ్యోతి ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక మెగా అవగాహన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి వివరించారు. వర్షా కాలం వచ్చే ముందు ఈ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, దీనిపై ఈ నెలంతా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే హాస్పిటల్‌లో ఔట్ పెషెంట్‌లకు మలేరియా నివారణ పద్ధతుల గురించి జీవీఎంసీ సిబ్బంది ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి వివరించారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ చారుమతి, ఏసీఎంఎస్ డాక్టర్ మహేష్‌కుమార్, డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భోజరాజు, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ టి.ప్రభాకరరావు, వాల్తేర్ డివిజనల్ పరిధిలోని జగదల్‌పూర్, కిరండూల్, కోరాపుట్, రాయగడ, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, మలేరియా ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కంబాలకొండలో ఫిర్యాదుల పెట్టె

ఆరిలోవ: ప్రముఖ పర్యాటక కేంద్రం కంబాల కొండ ఎకో టూరిజం పార్కులో అటవీ శాఖ అధికారులు ఫిర్యాదులు, సలహాలు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఇటీవల ఇక్కడ టికెట్ కౌంటర్ వద్ద ఫిర్యాదులు స్వీకరించే పెట్టె, సూచనలు స్వీకరించే పెట్టె వేర్వేరుగా ఏర్పాటు చేశారు. కంబాలకొండకు వెళ్లే సందర్శకులకు ఎదురైన అసౌకర్యాలు, సమస్యలపై రాసిన చీటీ ఫిర్యాదు పెట్టెలో వేయాలి. లేదంటే ఆ పెట్టె కిందన అందుబాటులో రాసిన అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ ఫోన్ నంబర్ 94408 10194కు ఫోన్ చేయవచ్చని అధికారులు తెలిపారు. దీంతో పాటు పార్కు అభివృద్ధి, కల్పించాల్సిన సౌకర్యాలు, సూచనలు, సలహాల గురించి రాసిన చీటీలు కూడా ఇక్కడ ఏర్పాటు చేసిన సలహాల పెట్టెలో వేయాలని అధికారులు కోరుతున్నారు.



కంబాలకొండ టికెట్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఫిర్యాదులు, సూచనలు సేకరించే పెట్టెలు